
సాక్షి
పల్నాడు
గురువారం । 1 । ఆగస్టు । 2024



వెండి నాగ పడగ సమర్పణ

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి గుంటూరుకు చెందిన గోరంట్ల వేణునాథ్ రూ.1,10,000 విలువైన వెండి నాగ పడగను బుధవార సమర్పించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 2,423 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 1,179 క్యూసెక్కులు వదిలారు.

శాకంబరిగా కన్యకా పరమేశ్వరి



అమరావతి: అమరావతిలో వేంచేసియున్న కన్యకా పరమేశ్వరి దేవిని ఆషాఢ మాసం సందర్భంగా శాకంబరి దేవిగా బుధవారం అలంకరించారు. ఆర్య వైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో భక్తులు ఊరేగింపుగా వచ్చి సారె సమర్పించారు.

న్యూస్‌రీల్

శాకంబరిగా విజయ చాముండేశ్వరి



నరసరావుపేట ఈస్ట్: పాతూరు చెరువుకట్ట వీధిలో ఉన్న శ్రీ విజయ చాముండేశ్వరి అమ్మవారిని ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని శాకంబరి దేవిగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు.

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు సన్నాహాలు

డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలకు ప్రభుత్వం అనుమతించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. పాఠశాలల్లో గత ప్రభుత్వ హయాంలో ఉన్న పేరెంట్స్ కమిటీలను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలుగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. ఎన్నికలకు ఆగస్టు 1వ తేదీన నోటిఫికేషన్ విడుదలవుతుందని చెప్పారు. అదే రోజు ఓటరు జాబితా ప్రదర్శిస్తారని తెలిపారు. 5వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారని చెప్పారు. సాయంత్రం 4 గంటలకు తుది జాబితా ప్రకటిస్తారని వివరించారు. 8వ తేదీన ఎన్నికలు ఉంటాయని తెలిపారు. చైర్మన్, వైస్ చైర్మన్‌ల చేత ప్రమాణ స్వీకారం అనంతరం తొలి సమావేశం ఉంటుందని వివరించారు. జిల్లాలో 1,173 ప్రాథమిక, 149 ప్రాథమికోన్నత, 174 ఉన్నత, 80 సీనియర్ సెకండరీ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు.

స్కూల్ గేమ్స్ సెక్రటరీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ సెక్రటరీ నియామకం కోసం జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో పని చేస్తున్న అర్హులైన వ్యాయామ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులను అనుసరించి 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలకుగాను ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరఫున జిల్లా సెక్రటరీ నియామకం చేపడుతున్నట్లు చెప్పారు. ఆగస్టు 3వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు డీఈఓ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయండి



నరసరావుపేట: జిల్లాలో ఆగస్టు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు నిర్వహించే ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచించారు. బుధవారం సాయంత్రం తన ఛాంబరులో వైద్యారోగ్యశాఖ అధికారులతో కలిసి వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు తాగించాలని, ఆరు నెలలు ఫీడింగ్ కొనసాగించాలని అన్నారు. తల్లిపాల ఆవశ్యకత గురించి ప్రభుత్వ హాస్పిటళ్లు, సచివాలయాలు, అంగన్వాడీ సెంటర్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి మాట్లాడుతూ తల్లిపాలు తాగటం వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతులుగా, చురుకుగా ఉంటారన్నారు. శిశు మరణాలు సైతం ఉండవని తెలిపారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.23.33 లక్షలు



తెనాలి: వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం హుండీని లెక్కించారు. తెనాలిలోని సీతారామస్వామి దేవస్థానం గ్రేడ్-1 కార్యనిర్వహణాధికారి జీవీ అమరనాథ్ సమక్షంలో భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడుల హుండీని లెక్కించారు. మొత్తం నగదు రూ.23,33,685 వచ్చినట్లు అధికారులు తెలిపారు.

పేదోడి మెతుకులూ మెక్కుతున్న తమ్ముళ్లు

- అధికార పార్టీ నాయకుల అడ్డగోలు దందా
- రేషన్ దుకాణాల నుంచి బియ్యం నేరుగా నల్లబజారుకు..
- మాఫియాలా ఎక్కడికక్కడ తరలింపునకు ఏర్పాట్లు
- నేటి నుంచి ప్రజా పంపిణీ ప్రక్రియ మొదలు
- ఇప్పటికే భారీగా పక్కదారి పట్టించిన తమ్ముళ్లు

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రక్రియలో భాగంగా ఇంటి ముందుకు రావాల్సిన రేషన్ బియ్యం బండి మూలకు చేరింది. కూటమి ప్రభుత్వం వచ్చి రెండు నెలలు కూడా కాకుండానే తెలుగుదేశం పార్టీ నేతల కన్ను పేదల కడుపు నింపే రేషన్ బియ్యంపై పడింది. డీలర్లుగా ఇప్పటికే ఉన్న వారిని తొలగించి చాలావరకు తమ వారిని నియమించుకున్నారు. లబ్ధిదారుల ఇంట మెతుకు ఉడక్క ముందే బెదిరించి మరీ పచ్చ ముఠా మెక్కుతోంది. ఆ బియ్యాన్ని పక్కదారి పట్టించింది. మాఫియా తరహాలో ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేసుకుని గుట్టుగా నల్లబజారుకు తరలించి భారీగా సొమ్ము చేసుకుంటోంది. అడ్డుకోవాల్సిన అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



నరసరావుపేట టౌన్ : నరసరావుపేట కేంద్రంగా రేషన్ మాఫియా బరి తెగించింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒకటో తేదీనే ఇంటి ముందుకు వచ్చి రేషన్ బియ్యం పంపిణీ చేసేవారు. బయోమెట్రిక్ విధానంతోపాటు జీపీఎస్ సిస్టమ్ ఏర్పాటు చేసి పంపిణీలో పారదర్శకతను అమలు చేశారు. తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిన రోజు నుంచి రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. గతంలో అక్కడక్కడ రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలించేవారు. కానీ ఇప్పుడు తెలుగు తమ్ముళ్లు మరీ బరితెగించారు. చౌక దుకాణాల నుంచి ఇంకా పంపిణీ మొదలుకాక ముందే పేదల బియ్యంలో దాదాపు సగం నల్లబజారుకు తరలించేశారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ ద్వారా ప్రతి నెలా 23 నుంచి 30వ తేదీ లోపు సరఫరాకు అవసరమైన రేషన్ బియ్యాన్ని చౌక దుకాణాలకు చేరవేస్తారు. 1 నుంచి 17వ తేదీ వరకు కార్డుదారులకు పంపిణీ చేయాల్సి ఉంటుంది. కానీ నేటి నుంచి పంపిణీ మొదలు కావాల్సి ఉండగా.. రెండు రోజుల క్రితమే బియ్యాన్ని అధికారపార్టీ మాఫియా నాయకులకు రేషన్ డీలర్లు అప్పగించారు. నరసరావుపేట నియోజకవర్గంలో మొత్తం 76,667 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. ఆగస్టు నెల కోటా సరకులకు సంబంధించి 160 చౌక దుకాణాలకు 1,107.598 మెట్రిక్ టన్నుల బియ్యంతోపాటు 18,500 కిలోల గోధుమపిండి సరఫరా చేశారు. రేషన్ డీలర్ల ద్వారా కార్డుదారులకు అందాల్సిన సరకును డీలర్లు, అక్రమార్కులు కుమ్మక్కై పేదల పొట్టగొట్టారు. రేషన్ షాపులకు బియ్యం చేరగానే గద్దల్లా వాలి తన్నుకుపోయారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఉన్నప్పటికీ రేషన్ మాఫియా రెచ్చిపోవడానికి కారణం అధికారపార్టీ ఒత్తిళ్లే అనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

కార్డుదారులకు బెదిరింపులు

తెల్ల కార్డుదారులను రేషన్ డీలర్లు బెదిరించి వారికి అందాల్సిన బియ్యం, ఇతర సరకులు ఇవ్వకుండానే బయోమెట్రిక్ వేయిస్తున్నారు. చెప్పినట్టు వినకపోతే కార్డు రద్దు అవుతుందని భయపెడుతున్నారు. దీంతో చేసేదిలేక డీలర్ ఇచ్చిన కేజీకి రూ.7 చొప్పున తీసుకొని మిన్నకుండిపోతున్నారు. తెలుగుదేశం అధికారంలోకి రాగానే అప్పటి వరకు ఉన్న డీలర్లను తొలగించి తమ పార్టీ కార్యకర్తలకు ప్రజా పంపిణీ బాధ్యతలను అప్పగించింది. దీంతో డీలర్ల అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఫిర్యాదులు అందుతున్నా అధికారులు ఆ వైపు చూడటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. కార్డుదారుల నుంచి రూ.7కు కొనుగోలు చేసిన బియ్యాన్ని రేషన్ మాఫియాకు రూ.13కు విక్రయిస్తున్నట్టు సమాచారం. తెలుగుదేశం పార్టీ నాయకులు నరసరావుపేట పట్టణంలోని రెండు, మూడు వార్డులకు కలిపి ఒక వ్యక్తికి రేషన్ బియ్యం సేకరణ బాధ్యతలు అప్పగించారు. ఆ వ్యక్తులు డీలర్ల వద్ద నుంచి ఒక ధరకు బియ్యాన్ని సేకరించి ఇక్కడి అధినాయకత్వం సూచించిన మరో వ్యక్తికి విక్రయించాలి. అక్కడి నుంచి రొంపిచర్ల, నకరికల్లు మండలాల్లోని రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. రెండు నెలలుగా రీసైక్లింగ్ అనంతరం నల్లబజారుకు బియ్యం వెళుతోంది.

తగిన చర్యలు తీసుకుంటాం

ప్రజాపంపిణీ బియ్యం తరలింపుపై ఇప్పటికే ఫిర్యాదులు అందాయి. విచారణ చేయాలని ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఎక్కడైనా అక్రమాలకు పాల్పడినట్టు రుజువైతే కచ్చితంగా తగిన చర్యలు తీసుకుంటాం.

– పద్మశ్రీ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

ప్రజా పంపిణీ వ్యవస్థపై నిఘా పెట్టండి

ఆర్డీవోలకు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశం

నరసరావుపేట: ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన సరకులు బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు) క్షేత్రస్థాయిలో నిఘా పెట్టాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు, స్టేక్ హోల్డర్స్(వాటాదారుల)తో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవస్థ బలోపేతానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. మండల స్థాయి స్టాక్ పాయింట్‌ల నుంచి రేషను షాపులకు సరకుల సరఫరా తీరును అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అవకతవకలకు పాల్పడకుండా చూడాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సకాలంలో సరకులు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు సరకులు అందుతున్న తీరుపై సంబంధిత సాంఘిక సంక్షేమ, బీసీ వెల్ఫేర్, తదితర శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. పౌర సరఫరాల శాఖ మేనేజర్, తహసీల్దార్లు, ఎంఎల్‌సీ పాయింట్ ఇన్‌చార్జులు, ఐసీడీఎస్ సిబ్బందితో వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారం అందేలా చూడాలన్నారు. జిల్లా విద్యాశాఖలో మధ్యాహ్న భోజన పథకానికి సరకుల సరఫరా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవోలు రమాకాంతరెడ్డి, మురళీకృష్ణ, పి.సరోజిని, పౌర సరఫరాల శాఖ డీఎం వరలక్ష్మి, జిల్లా అధికారి ఎస్.పద్మశ్రీ., జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబుల నాయుడు, డీటీడబ్ల్యూవో వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయాపై దాడి యత్నం అన్యాయం





చావపాడు అంగన్‌వాడీ కేంద్రం వద్ద హల్‌చల్ చేస్తున్న టీడీపీ నాయకులు, మహిళలు

అమరావతి: మండల పరిధిలోని చావపాడు అంగన్‌వాడీ కేంద్రంలో విధుల్లో ఉన్న ఆయాపై అదే గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీకి చెందిన మహిళలు దాడికి ప్రయత్నించడం అన్యాయమని సీఐటీయూ మండల కార్యదర్శి బి. సూరిబాబు అన్నారు. దీనిపై బుధవారం ఆయన మాట్లాడుతూ.. చిన్నారులు వచ్చే అంగన్‌వాడీ కేంద్రంలో టీడీపీ నాయకులు హల్‌చల్ చేస్తూ భయానక వాతావరణం సృష్టించటం ప్రజాస్వామ్య వాదులు ఖండించాలన్నారు. అధికారం ఉంది కదా అని ఆయాను విధుల నుంచి తొలగించడం కోసం మానసికంగా వేధించడం, బెదిరించే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. ఎనిమిది సంవత్సరాలుగా ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనంతో ఆమె పనిచేస్తుంటే ఇప్పుడు రాజీనామా చేయాలని బెదిరించడం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. మరోపక్క ఎండ్రాయి, చావపాడు, వైకుంఠపురం గ్రామాల్లో సమస్యలు ఎదుర్కొంటూ కూడా డ్వాక్రా యానిమేటర్‌లుగా పనిచేస్తున్న వారిని అధికారి పార్టీ వారు బెదిరించటం, సీసీల ద్వారా మాట్లాడించి తొలగించాలనుకోవటం సరైన తీరు కాదని పేర్కొన్నారు. డ్వాక్రా గ్రూప్ సభ్యుల విషయంలో తప్పులు జరిగితే అందరూ కలిసి తీర్మానం ద్వారా తగు నిర్ణయం తీసుకోవాలేగానీ అధికారపార్టీ నాయకుల అండదండలతో సీసీలు వారిని తొలగించాలని చూడటం దారుణమన్నారు. యానిమేటర్లను పొట్టకొట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నా గ్రామ నాయకులు దౌర్జన్యాలు చేయటం ప్రజాస్వామ్యంలో మంచిది కాదని హితవు పలికారు. ఇకనైనా తీరు మార్చుకోవాలన్నారు.

డెంగీ దోమల దండయాత్ర

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలపై డెంగీ దోమలు దండయాత్ర చేస్తున్నాయి. వానాకాలం మొదలవడంతో తమ ప్రతాపాన్ని చూపుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో 128 కేసులు వెలుగు చూసిన నేపథ్యంలో ఇంకా బాధితులు ఎక్కువగానే ఉంటారని అంచనా. పరిసరాల పరిశుభ్రత, తగిన జాగ్రత్తలు పాటించకుంటే మరింత మంది డెంగీ బారిన పడాల్సి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. డెంగీ నివారణకు అధికారులు ఇకనైనా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న బాధితులు
- జిల్లాలో ఇప్పటికే వెలుగులోకి 128 కేసులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యనిపుణులు
- పారిశుద్ధ్య నిర్వహణ లేమిపై ప్రజల మండిపాటు
- అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



ప్రకాష్‌నగర్ బస్టాండ్ - రైల్వేస్టేషన్ రోడ్డులో పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్రంగా డ్రైనేజీ కాలువ

నరసరావుపేట : జిల్లాలో రోజు రోజుకు డెంగీ కేసులు పెరుగుతున్నాయి. మొత్తం 28 మండలాల్లో ఇప్పటివరకు 128 కేసులు నమోదయ్యాయి. పలు గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో ఈ పరిస్థితి తలెత్తిందనే విమర్శలు వస్తున్నాయి. కాలువల్లో మురుగు నీరు, వర్షాలు పడి గుంతల్లో నీరు నిల్వతో దోమలు పెరిగి రోగాలు విజృంభిస్తున్నాయి. పల్లెల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఇక పట్టణాల్లో నానాటికీ పరిస్థితి తీసికట్టుగా తయారవుతోంది. గ్రామాల్లో అత్యధికంగా డెంగీ కేసులు బయట పడుతున్నాయి. ఇప్పటివరకు పల్లెల్లో 112 కేసులు నమోదు కాగా, పట్టణాల్లో కేవలం 16 కేసులే వెలుగుచూశాయి.

ఈ ఒక్క ల్యాబే దిక్కు...

సత్తెనపల్లి డివిజన్‌లోని పలు గ్రామాల్లో 40 కేసులు, నరసరావుపేట – 33, గురజాలలో 39 నమోదయ్యాయి. సత్తెనపల్లి, నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట, పిడుగురాళ్ల పురపాలక సంఘాల్లో రెండు చొప్పున, మాచర్లలో నాలుగు, దాచేపల్లి, గురజాల నగర పంచాయతీల్లో ఒకటి చొప్పున కేసులు నమోదయ్యాయి. సత్తెనపల్లి డివిజన్‌లోని క్రోసూరు పీహెచ్‌సీ పరిధిలో 10 కేసులు వెలుగుచూశాయి. నరసరావుపేట డివిజన్‌లోని కోటప్పకొండ పీహెచ్‌సీ పరిధిలో ఐదు, గురజాల డివిజన్ వెల్దుర్తి ఉప్పలపాడు పీహెచ్‌సీ పరిధిలో అత్యధికంగా ఐదు కేసులు నమోదయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైద్యరంగానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి ఎక్కడికక్కడ నూతన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఏర్పాటు చేయటం, ఉన్న వాటిని ఆధునికీకరించి వైద్యపరికరాలు, సిబ్బంది, మందులు అందుబాటులో ఉంచటంతో డెంగీ రోగాల బారిన పడిన వారికి సులభంగా ఉచిత వైద్యం దొరికింది. దీంతో ఎవరూ మృతి చెందిన దాఖలాలు లేవు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందుబాటులోకి వచ్చిన 200 పడకల ప్రభుత్వ వైద్యశాలలో డెంగీ లక్షణాలను నిర్ధారించేందుకు ల్యాబ్ ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా ఈ ఒక్క ల్యాబ్‌లోనే ఎలీసా పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారిస్తారు.

సత్వర వైద్యం అవసరం

దోమలు కుట్టిన తర్వాత డెంగీ బారిన పడిన వారికి హఠాత్తుగా తీవ్రమైన జ్వరం, భరించలేని తలనొప్పి వస్తుంది. కండరాలు, కీళ్ల నొప్పులు వస్తాయి. ఆకలి మందగించి వాంతులు అవుతాయి. చర్మంపై దుద్దుర్లు, కనుగుడ్లను కదపలేనంతగా కళ్లనొప్పి ఉంటుంది. సరైన సమయానికి వైద్యం చేయించుకోకపోతే ఒంట్లో రక్తస్రావం జరిగి ప్రాణాలకు ముప్పు రావొచ్చు.

నివారణ చర్యలు తీసుకుంటున్నాం



డెంగీ కేసులు వెలుగుచూసిన చోట 50 మీటర్ల విస్తీర్ణంలోని ప్రదేశంలో పకడ్బందీగా నివారణ చర్యలు తీసుకుంటున్నాం. ఫీవర్ సర్వే చేస్తున్నాం. ఇళ్లల్లో దోమలను చంపేందుకు మందు పిచికారి చేయిస్తున్నాం. సమీపంలోని నీటి కుంటల్లో దోమలు వృద్ధి చెందకుండా వాటి లార్వాలను నాశనం చేసేందుకు ఆయిల్ బాల్స్ వదులుతున్నాం. లార్వాలను తినే గంబూషియా చేపలను వాడుకలోని లేని బావులు, చిన్న కాలువల్లో విడిచిపెడుతున్నాం. ప్రతి ఒక్కరూ ఇంటి లోపల, చుట్టుపక్కల పాత టైర్లు, కొబ్బరి బొండాలు, పాత పాత్రలు, రోళ్ల వంటి వాటిలో నీరు నిల్వకుండా చూసుకోవాలి. దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ రవీంద్ర రత్నాకర్, జిల్లా మలేరియా అధికారి

టీడీపీ సమర్పించు కేబుల్ వార్

- నరసరావుపేటలో ముదిరిన ఆధిపత్య పోరు
- రోజుకో మలుపుతో పేటలో రేగుతున్న కాక
- రెండు వర్గాలుగా పోటీ పడుతున్న టీడీపీ నేతలు
- కోడెల వర్సెస్ నల్లపాటిగా సాగుతున్న సమరం
- నాడు తండ్రి అండతో కోడెల శివరాం హల్‌చల్
- నేడు ఎమ్మెల్యే భరోసాతో నల్లపాటి రాము పట్టు
- కేబుల్ వైర్లను సైతం కత్తిరించిన కోడెల వర్గం
- అడ్డుకున్నందుకు నల్లపాటి వర్గంపైనే ఫిర్యాదు
- కేసులు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు



2016లో కోడెల శివరాం ఒత్తిడితో నల్లపాటి రామును అరెస్ట్ చేస్తున్న పోలీసులు (ఫైల్ ఫొటో)

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా నరసరావుపేటలో తెలుగుదేశం పార్టీ సమర్పించు 'కేబుల్ వార్' ప్రస్తుతం ప్రదర్శితమవుతోంది. సంపాదనే పరమావధిగా, పార్టీ అండ చూసుకొని నియోజకవర్గంలో కేబుల్ ప్రసారాలపై ఆధిపత్యం కోసం నల్లపాటి, కోడెల వర్గీయులు పోరుకు కాలు దువ్వుతున్న తీరు ఆ పార్టీలో కాక రేపుతోంది. తండ్రి దివంగత స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు అధికారాన్ని అడ్డుపెట్టుకొని 2016లో కోడెల శివరాం కేబుల్ వ్యవస్థను తన గుప్పెట్లోకి తీసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో మరోసారి తన పట్టు నిలుపుకొనేందుకు పావులు కదుపుతున్నారు. ఈ నేపథ్యంలో గత రెండు నెలలుగా కేబుల్ ఆపరేటర్లను ప్రలోభపెట్టి తమ వైపు తిప్పుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల తర్వాత ఎమ్మెల్యే అండతో కేబుల్ ప్రసారాలు ప్రారంభించిన నల్లపాటి రాము కూడా విస్తరణకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుత ఎన్‌సీవీ కేబుల్ వైర్లను కత్తిరించి అగ్గి రాజేశారు. ఈ వ్యవహారంతో నల్లపాటి వర్సెస్ కోడెల వర్గీయులు మరోమారు ఘర్షణకు దిగడంతో ఇరువర్గాలపై కేసుల నమోదు వరకు వ్యవహారం వెళ్లింది.

ఎన్‌సీవీపై దాడి చేసి కబ్జా...

ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న నల్లపాటి రామచంద్రప్రసాద్(రాము) నరసరావుపేట నియోజకవర్గంలో నల్లపాటి కేబుల్ విజన్(ఎన్‌సీవీ) పేరిట ప్రసారాలను గత 20 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. ప్రతినెలా రూ.లక్షల్లో ఆదాయం వస్తుండటంతో 2014 తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత కోడెల శివరాం కేబుల్ వ్యవస్థను తన గుప్పెట్లో తీసుకునేందుకు కుట్ర పన్నారు. తన అనుచరులతో అప్పుడు వైఎస్సార్ సీపీలో ఉన్న నల్లపాటి రాముపై దాడి చేయడంతోపాటు ఎన్‌సీవీ కార్యాలయాన్ని ధ్వంసం చేయించారు. ఈ సంఘటన అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కేబుల్ వ్యవస్థను హస్తగతం చేసుకొన్న శివరాం రాజాగారి కోటలోని తన ఇంటి నుంచి కే-ఛానల్ పేరిట కేబుల్ కార్యకలాపాలు నిర్వహించారు. జీసీటీవీ కార్యాలయాన్నీ ధ్వంసం చేసి ఆ వ్యవస్థను కూడా స్వాధీనం చేసుకున్నారు. అంత అరాచకం సృష్టించినా తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టి కేసులు, పరిహారం లేకుండా వ్యవహారాన్ని చక్కదిద్దారు

అగ్రవర్ణ వ్యక్తి ఫిర్యాదుతో అట్రాసిటీ కేసు...

కే-ఛానల్‌లో భాగస్వామి అయిన విజయవాడకు చెందిన గన్నవనేని నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదుతో నల్లపాటి వర్గీయులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అయితే కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఫిర్యాదుతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడమేంటని నల్లపాటి రామచంద్రప్రసాద్ దీనిపై గుంటూరు రేంజ్ ఐజీకి ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. ఓ వైపు నా కేబుల్ వ్యవస్థను నాశనం చేస్తూనే, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అయిన తనపైనే అక్రమ కేసులు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారట. ఈ కేసు నమోదు వ్యవహారంలో కోడెల శివరాం తెరవెనుక ఉండి చక్రం తిప్పారనే చర్చ పేటలో నడుస్తోంది.

తలపట్టుకుంటున్న ఎమ్మెల్యే...

తెలుగుదేశం పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న ఇద్దరు నాయకులు కేబుల్ వ్యవహారంలో పోరుకు దిగడం ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబుకు సంకటంగా మారింది. ఎటూ చెప్పలేని పరిస్థితుల్లో ఉండటంతో చేతులెత్తేశారు. అయితే ఎన్నికల ముందు కేబుల్ వ్యవస్థను అప్పగిస్తానని నల్లపాటి రాముకు ఆయన హామీ ఇచ్చినట్టు ప్రచారం నడుస్తోంది. అందులో భాగంగానే ఎన్నికల అనంతరం ఎన్‌సీవీ కేబుల్ ప్రసారాలను ప్రారంభించారు. కోడెల శివరాం మాత్రం కేబుల్ వ్యవస్థ తనకే కావాలంటూ ముందుకు రావడంతో ఎమ్మెల్యే ఎవరికి సర్దిచెప్పలేని పరిస్థితిలో ఉన్నారు. 2016లో కేబుల్ ఆధిపత్యంలో జరిగిన పోరులో పెద్ద ఎత్తున ఆస్తుల ధ్వంసంతోపాటు వ్యక్తిగత దాడులు జరిగాయి. ప్రస్తుతం రెండు వర్గాలు ఒకే పార్టీలో ఉండి మరోసారి పోరుకు సిద్ధమవుతుండటంతో ఈ పరిణామం ఎటువైపు దారితీస్తోందన్న ఆందోళన టీడీపీలో నెలకొంది.

మరోసారి పట్టు కోసం పోరు..

టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నల్లపాటి రాము నియోజకవర్గంలో కేబుల్ ప్రసారాలను రెండు నెలలుగా తన ఆధీనంలోకి తీసుకున్నారు. దీనికి ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు మద్దతు తెలపడంతో ప్రస్తుతం రాముకు చెందిన ఎన్‌సీవీ కేబుల్ ప్రసారాలు నడుస్తున్నాయి. ఈ వ్యవహారాన్ని జీర్ణించుకోలేని కోడెల శివరాం భాగస్వామి నరసింహారావు తన సిబ్బందితో ఎన్‌సీవీకి చెందిన కేబుల్ వైర్లను కత్తిరించి ప్రసారాలకు అంతరాయం కలిగించారట. గత శుక్రవారం అరండల్‌పేటలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఎన్‌సీవీకి చెందిన కేబుల్ వైర్లను కోడెల వర్గానికి చెందిన కొందరు కత్తిరించారు. ఈ విషయం తెలుసుకున్న ఎన్‌సీవీ సిబ్బంది అక్కడికి చేరుకొని వైర్ల కత్తిరించిన ముగ్గురు యువకులను పట్టుకుని కార్యాలయానికి తరలించారు. యువకులు దీనిపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో సిబ్బంది అక్కడికి చేరుకొని వారిని విడిపించారు.

రషీద్ హత్య కేసులో మరో ముగ్గురి అరెస్ట్

మొత్తం పదికి చేరిన అరెస్టులు

వినుకొండ (నూజెండ్ల): పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన రషీద్ హత్య కేసులో మరో ముగ్గురు నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు వినుకొండ టౌన్ సి.ఐ. సాంబశివరావు తెలిపారు. వినుకొండలోని సంజయ్‌గాంధీ నగర్‌కు చెందిన పఠాన్‌సైదా, దారా ప్రవీణ్, ఓబయ్య కాలనీకి చెందిన బొట్లపాలెం సుభానీలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు చెప్పారు. గత నెల 17వ తేదీన రషీద్‌ను హత్య చేసిన జిలానీని అరెస్ట్ చేసిన పోలీసులు.. ఇటీవల మరో ఆరుగురిని అరెస్ట్ చేశారు. దీంతో ఇప్పటివరకు రషీద్ హత్యకేసులో అరెస్టయిన వారి సంఖ్య పదికి చేరింది. మరికొందరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్త రషీద్‌ను దారుణంగా హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. తొలుత వ్యక్తిగత కక్ష వల్లే ఈ హత్య చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు రావడంతో కొందరు నిందితులను అరెస్టు చేశారు.

క్లుప్తంగా

పల్నాడు జిల్లా దిశ డీఎస్పీగా ప్రసాద్

నరసరావుపేట: పల్నాడు జిల్లా దిశ డీఎస్పీగా బి.ప్రసాద్ నియమితులయ్యారు. ప్రభుత్వం బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పలువురు డీఎస్పీలకు స్థాన చలనం కలిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో గురజాల డీఎస్పీగా పనిచేస్తున్న సీహెచ్ శ్రీనివాసరావును పోలీసు హెడ్ క్వార్టర్‌కు రిపోర్టు చేయాలని పేర్కొంది. కాగా, నరసరావుపేట డీఎస్పీగా ఎవరినీ నియమించకపోవటం గమనార్హం.

రేపు షూటింగ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం గుడిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆగస్టు 2వ తేదీన సబ్ జూనియర్ బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు షూటింగ్ బాల్ అసోసియేషన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి కిరణ్ కుమార్ బుధవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, తల్లిదండ్రుల అంగీకార పత్రంతో హాజరు కావాలన్నారు. ఎంపికైన వారు ఆగస్టు 8వ తేదీ నుంచి చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 98486 55755 ఫోను నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

12 మండలాల్లో అధిక వర్షపాతం

నరసరావుపేట: జిల్లాలో జూలై నెలలో సాధారణ వర్షపాతాన్ని మించి నమోదు అయింది. మొత్తం 28కిగాను 12 మండలాల్లో సాధారణం కంటే అధికంగా పడింది. జిల్లా మొత్తం 3,666.7 మి.మీ. కురవాల్సి ఉండగా... 3732.4 మి.మీ వర్షపాతం నమోదైంది. మాచర్ల, దుర్గి, బొల్లాపల్లి, వినుకొండ, శావల్యాపురం, ఈపూరు, రొంపిచర్ల, నరసరావుపేట, ముప్పాళ్ల, నాదెండ్ల, చిలకలూరిపేట, యడ్లపాడు మండలాల్లో అధికంగా వానలు పడ్డాయి.

మద్యం మత్తులో భార్యను కడతేర్చిన భర్త



వెల్దుర్తి: భార్యను మద్యం మత్తులో భర్త కడతేర్చిన సంఘటన మండలంలోని గుడిపాటి చెరువు ప్రాంతంలో బుధవారం చోటుచేసుకుంది. బంధువుల కథనం ప్రకారం.. గుడిపాటి చెరువుకు చెందిన మండ్లి రైతు బయన్న, మల్లమ్మ (50) దంపతులు. మద్యం మత్తులో ఉన్న బయన్నకు భార్యతో బుధవారం చిన్న విషయమై చోటుచేసుకున్న వివాదం చినికి చినికి పెద్దదైంది. ఆ మత్తులో మల్లమ్మపై అతడు దాడి చేశాడు. హత్య చేసిన తర్వాత పారిపోయాడు. మధ్యాహ్నం పక్కింటి వారు మల్లమ్మ కోసం వెళ్లినప్పుడు దారుణం వెలుగుచూసింది. స్థానికుల సమాచారంతో వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల విశ్రాంత జీవితం ఆనందంగా గడవాలి



పదవీ విరమణ పొందిన వారిని సన్మానించిన ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీలు

నరసరావుపేట: పోలీసు విభాగం తరపున ప్రజాసేవకు సమయం, శక్తి కేటాయించిన వారి విశ్రాంత జీవితం మంచి ఆరోగ్యంతో, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడవాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. జిల్లాలో జూలై 31వ తేదీతో పదవీ విరమణ పొందిన నరసరావుపేట ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఎస్ఐ దిలీప్‌కుమార్, చిలకలూరిపేట రూరల్, అచ్చంపేట పోలీసుస్టేషన్ల ఏఎస్ఐలు ఆర్య స్వర్ణలత, జి.యోహాన్, పిడుగురాళ్ల పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ కె.చిన్న పుల్లారావు, వారి కుటుంబ సభ్యులను బుధవారం ఘనంగా సన్మానించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో వారికి జ్ఞాపికలు, విలువైన బహుమతులు అందించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించడం అభినందనీయం అన్నారు. కుటుంబ సభ్యుల సహకారంతోనే ఇన్నేళ్ల దిగ్విజయంగా విధులు నిర్వహించారని గుర్తు చేశారు. వారి సేవలను పోలీసుశాఖ ఎప్పటికీ గుర్తు ఉంచుకుంటుందని అన్నారు. అడ్మిన్ అదనపు ఎస్పీ ఆర్.రాఘవేంద్ర, క్రైం విభాగ అదనపు ఎస్పీ సీహెచ్ లక్ష్మీపతి, ఏఆర్ అదనపు ఎస్పీ ఆర్.రామచంద్రరాజు, ఏఆర్ డీఎస్పీ గాంధీ రెడ్డి, జిల్లా పోలీసు కార్యాలయ ఏఏవో కేవీడీ రామారావు, డీసీఆర్‌బీ సీఐ అశోక్ కుమార్, వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్, పల్నాడు జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు టి.మాణిక్యాలరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండ్లకమ్మ నదికి నీరందిస్తాం

సాక్షి ఎఫెక్ట్



నదిని పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల, ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు, అధికారులు

వినుకొండ (నూజెండ్ల): నియోజకవర్గంలోని ఐనవోలు సమీపంలో గుండ్లకమ్మ నదిని ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, అధికారులతో కలిసి నదిని పరిశీలించారు. నదిపై ఆధారపడిన గ్రామాలకు తాగు, సాగు నీరు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే జి.వి. అభ్యర్థన మేరకు నదిపై ప్రతి పది కిలోమీటర్లకు చెక్ డ్యామ్‌లు నిర్మించి తాగు, సాగు నీటిని అందిస్తామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట స్థానిక అధికారులు, నాయకులు ఉన్నారు. గత నెల 26న గుండ్లకమ్మకు మొండిచేయి శీర్షికన 'సాక్షి' దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన మంత్రి జలాలు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు తగవు

పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్

మాచర్ల: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల విషయంలో మొదటి నుంచి అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం ఇప్పటికీ మాచర్ల నియోజకవర్గంలో అదే తీరు కొనసాగిస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ అన్నారు. ఈ ప్రాంతాలలో వారిపై ఇంకా దాడులు చేయడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇది ప్రజాస్వామిక ప్రభుత్వమా? అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చేటప్పుడు చాలా పథకాలు అమలు చేస్తామని మాయమాటలు చెప్పారన్నారు. తీరా గద్దెనెక్కాక ఎప్పుడూ లేని విధంగా గిరిజన, దళిత, బీసీ వాడల్లోని వారిపై దాడులు చేయడం తగదన్నారు. ఎక్కడా అరాచకాలు జరగలేదని, జరగకుండా చూస్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పినా శ్రీరాంపురంతండ, మరసపెంట, అచ్చమ్మకుంట, చింతలతండ వంటి గిరిజన తండాలలో ఎందుకు దాడులు జరుగుతున్నాయని ప్రశ్నించారు. వీరంతా ఎప్పుడైనా రాజకీయాలలో అగ్రవర్ణాలకు వ్యతిరేకంగా పనిచేశారా అని ప్రశ్నించారు. ఫ్యాక్షన్ రాజకీయ సంస్కృతిని ప్రోత్సహిస్తూ గిరిజన, దళితుల వాడలలోనూ ఆ తరహా వాతావరణం పెంచుతున్నారని పేర్కొన్నారు. ఈ రాజకీయాలు మంచివి కాదన్నారు. ప్రతి కుటుంబానికి చేదోడుగా నిలబడి అందరి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. లేదంటే ఆయా వర్గాలన్నీ దూరమై ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందని ఎమ్మెల్యేకు సూచించారు. ప్రజల ఆకాంక్షల మేరకు మాత్రమే కూటమి వ్యవహరించాలని, దౌర్జన్యాలు తగవని పేర్కొన్నారు.

యువకుడి దుర్మరణం

పెదకాకాని: జాతీయ రహదారిపై ఆగి ఉన్న వాహనాన్ని వెనుక నుంచి మరో వాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన పెదకాకాని పోలీసుస్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. పొన్నూరు ప్రాంతానికి చెందిన మన్నెం కోటయ్య, చౌడూరి శ్రీనివాసరావు, సోమయ్య అశోక్ లేలాండ్ బడా దోస్త్ వాహనంలో తేనె బుట్టలు లోడుతో మంగళవారం కృష్ణాజిల్లా కంచికచర్ల వెళ్లారు. అదే రోజు రాత్రి తిరిగి పొన్నూరు బయలు దేరారు. వారు ప్రయాణిస్తున్న వాహనం జాతీయ రహదారిపై తక్కెళ్లపాడు శివారు ప్రాంతంలోకి చేరుకున్నారు. అదే సమయంలో ఆ ప్రాంతంలో టైర్ పంక్చర్ కావడంతో రోడ్డుపైనే ఆగిన మరొక అశోక్ లేలాండ్ బడా దోస్త్ వాహన్ని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆ వాహనంలో ఉన్న చౌడూరి శ్రీనివాసరావు(28) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ మన్నెం కోటయ్య, సోమయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ కోటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు ఎన్నికలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త జి.వి జయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న పేరెంట్ కమిటీలను ప్రభుత్వం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలుగా పేరు మార్పు చేసి ఎన్నికలు నిర్వహించేందుకు ఉత్తర్వులు విడుదల చేసిందని వెల్లడించారు. ఎస్ఎంసీ ఎన్నికల షెడ్యూల్, మార్గదర్శకాలు, విధి విధానాలను ఇప్పటికే విడుదల చేశామని, గురువారం ఎన్నికల నోటిఫికేషన్‌తో పాటు ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత జాబితాపై అభ్యంతరాలుంటే ఈనెల 5వ తేదీలోగా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలియపర్చాలని సూచించారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా 810 ప్రాథమిక, 76 ప్రాథమికోన్నత, 181 ఉన్నత పాఠశాలలను కలుపుకుని 1,067 పాఠశాలలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వివరించారు.

తక్కెళ్ళపాడు వద్ద దారి దోపిడీ

- ఏటీఎం కార్డు పేరుతో అడ్డగింత
- రూ.4 లక్షలతో దుండగుడు పరార్
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

పెదకాకాని: పత్తి వ్యాపారిని అడ్డగించి రూ.4 లక్షలు దోచుకెళ్లిన ఘటన బుధవారం మండలంలోని తక్కెళ్లపాడు వద్ద బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. కృష్ణా జిల్లా జి.కొండూరుకు చెందిన పెద్ది సుబ్బారావు పత్తి కొనుగోలు వ్యాపారి. పెదకాకాని మండలంలోని నంబూరు అడ్డరోడ్డు సమీపంలోని అమలోద్భవి హోటల్ యజమాని రవి గతంలో సుబ్బారావు వద్ద తీసుకున్న అప్పు రూ.4 లక్షలు బుధవారం ఇచ్చాడు. నగదు తీసుకుని పెదకాకానిలో నివసిస్తున్న కుమార్తె హేమలత ఇంటికి వెళ్లాడు. అనంతరం ప్రత్తిపాడు మండలం, కోయవారిపాలేనికి చెందిన సాంబశివరావుకు చెల్లించేందుకు రూ.4 లక్షలతో బయలు దేరాడు. తక్కెళ్లపాడు శివారులో జాతీయ రహదారిపై వెళుతుండగా వెనుక నుంచి ముఖానికి ముసుకు(మంకీ క్యాప్) ధరించిన వ్యక్తి బైక్‌పై వచ్చి సుబ్బారావు బైక్‌ను అడ్డుపెట్టి ఆపాడు. నా ఏటీఎం కార్డు ఎందుకు తీసుకున్నావ్ అంటూ వాదనకు దిగాడు. నాకు తెలియదు, నేను తీసుకోలేదని చెబుతున్నా వివాదానికి దిగి జేబులో, బైక్ పర్సులో చెక్ చేశాడు. ఆ సమయంలో సుబ్బారావు వద్ద ఉన్న డబ్బులు లాక్కుని బైక్‌పై వెళ్లిపోయాడు. దీంతో బాధితుడు పెదకాకాని పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

దూరవిద్య టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ(ఏపీఓఎస్ఎస్) ఆధ్వర్యంలో దూరవిద్య టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్‌లో ప్రవేశానికై ఈనెల 20లోగా అడ్మిషన్ ఫీజు చెల్లించి, 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెన్త్‌లో చేరేందుకు 14 ఏళ్లు, ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు టెన్త్ పూర్తి చేసి, 15 ఏళ్లు నిండిన అభ్యాసకులు ఏపీఓపెన్‌స్కూల్.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర సమాచారం కోసం ఇదే సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

గుంటూరు రేంజ్‌లో 24 మంది సీఐలు బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీచేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
టి.విజయకృష్ణ	సీసీఎస్, ఒంగోలు	రాపూరు సర్కిల్, నెల్లూరు జిల్లా
పి.సుబ్బారావు	వీఆర్, గుంటూరు	వెంకటాచలం సత్రం సర్కిల్, నెల్లూరు జిల్లా
మారీదు శ్రీనివాసరావు	వీఆర్, గుంటూరు	చీరాల 1 టౌన్ పీఎస్, బాపట్ల జిల్లా
ఎం.విజయచరణ్	సోషల్ మీడియా/సైబర్ క్రైం సెల్, పల్నాడు	నరసరావుపేట -1 టౌన్ పీఎస్
యు.శోభన్‌బాబు	డిఎస్‌బీ2, పల్నాడు జిల్లా	వినుకొండ టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా
పసుపులేటి రామకృష్ణ	వేమూరు సర్కిల్, బాపట్ల జిల్లా	నరసరావుపేట రూరల్ సర్కిల్ , పల్నాడు జిల్లా
బి.సుబ్బనాయుడు	ఎస్సీ, ఎస్టీ సెల్, పల్నాడు	చిలకలూరిపేట రూరల్ సర్కిల్, పల్నాడు జిల్లా
కె.వెంకటప్రసాద్	డీఎస్‌బీ3, గుంటూరు	అచ్చంపేట యూపీఎస్, పల్నాడు జిల్లా
ప్రత్తిపాటి సురేష్	రేంజ్ వీఆర్, గుంటూరు	పెదకూరపాడు రూరల్ సర్కిల్, పల్నాడు జిల్లా
పోలూరి శ్రీనివాస్	సత్తెనపల్లి టౌన్, పల్నాడు జిల్లా	సత్తెనపల్లి రూరల్ పీఎస్, పల్నాడు జిల్లా
మార్వనేని సుబ్బారావు	చీమకుర్తి పీఎస్ అటాచ్‌మెంట్	చీమకుర్తి పీఎస్, ప్రకాశం జిల్లా
సీహెచ్.హజరత్తయ్య	దిశ, బాపట్ల	సింగరాయకొండ సర్కిల్, ప్రకాశం జిల్లా
వై.నాగరాజు	రేంజ్ వీఆర్, గుంటూరు	ఒంగోలు 1 టౌన్ పీఎస్, ప్రకాశం జిల్లా
కె.అజయ్‌కుమార్	మహిళా పీఎస్2, నెల్లూరు జిల్లా	ఒంగోలు తాలుకా పీఎస్, ప్రకాశం జిల్లా
పి.వెంకటనారాయణ	నెల్లూరు వి(1) వేదాయపాలెం పీఎస్	కలిగిరి సర్కిల్, నెల్లూరు జిల్లా
ఎ.మల్లికార్జునరావు	రేపల్లె రూరల్ సర్కిల్, బాపట్ల జిల్లా	రేపల్లె టౌన్ పీఎస్, బాపట్ల జిల్లా
పి.కిరణ్	రేంజ్ వీఆర్, గుంటూరు	పట్టాభిపురం పీఎస్, గుంటూరు జిల్లా
ఎం.శేషగిరిరావు	రేంజ్ వీఆర్, గుంటూరు	మార్టూరు యూపీఎస్, బాపట్ల జిల్లా
కాకుమాను వెంకటరావు	సీసీఎస్, గుంటూరు	సంతమంగులూరు సర్కిల్, బాపట్ల జిల్లా
కొంకా శ్రీనివాస్	అరండల్‌పేట పీఎస్ అటాచ్‌మెంట్	అరండల్‌పేట పీఎస్, గుంటూరు జిల్లా

మంగళగిరి టౌన్ పీఎస్‌కు డి.వినోద్‌కుమార్, మంగళగిరి రూరల్ సర్కిల్‌కు యార్లగడ్డ శ్రీనివాసరావు, నల్లపాడు పీఎస్‌కు కె.వంశీధర్, చిట్టెం కోటేశ్వరరావును నెల్లూరు 1 టౌన్ పీఎస్‌కు బదిలీ చేశారు.

వీఆర్‌కు 15 మంది..

సీఐలు పి.శేషగిరిరావు, సి.కృష్ణారెడ్డి, సిరిగిరి సాంబశివరావు, కె.మల్లికార్జున, పి.శ్రీనివాసరెడ్డి, కరిముల్లాషావలి, జి.మంగరావు, ఎం.రాజేష్‌కుమార్, డి.రంగనాథ్, ఎం.డీఫిరోజ్, ఎం.నజీర్‌బేగ్, ఎస్.విజయచంద్ర, ఎస్వీ రాజశేఖర్‌రెడ్డి, కె.నరసింహారావు, బి.అశోక్‌కుమార్‌లను వీఆర్‌కు పంపించారు.

ఆలయంలో చోరీ చేసిన ముగ్గురు అరెస్టు

బంగారం, బైకు, సీసీ కెమెరాలు స్వాధీనం



విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్సై చల్లా సురేష్

శావల్యాపురం: చెడు వ్యసనాలకు బానిసలై చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై చల్లా సురేష్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషనులో విలేకర్ల సమావేశంలో ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 22వ తేదీన శానంపూడి శివారు బొందిలిపాలెం గ్రామంలోని శ్రీ అడవి పేరంటాళ్లమ్మ దేవాలయంలో చోరీ జరిగింది. బల్లికురవ మండలం కొత్తూరుకు చెందిన తన్నీరు నరసింహారావు, బొల్లాపల్లికి చెందిన గోగు నరసింహారావు, వినుకొండకు చెందిన కత్తి మురళి ఈ ఆలయం తాళాలు పగలకొట్టి హుండీలోని 4 గ్రాముల బంగారు ఉంగరం, మూడు సీసీ కెమెరాలు, వెండి పట్టీలు, రూ.700 నగదు చోరీ చేశారు. ప్రత్తిపాడు మండలం తిక్కరెడ్డిపాలెం గ్రామానికి చెందిన సాయి అనే వ్యక్తి శావల్యాపురం జాతీయ రహదారి వెంట దాబాలో భోజనానికి వెళ్తూ బైకు పార్కింగ్ చేశాడు. ఈ ముగ్గురు వ్యక్తులు ఆ బైకును చోరీ చేసి, మరుసటి రోజు రాత్రి అమ్మవారి ఆలయంలో దొంగతనానికి పాల్పడినట్లు వెల్లడైంది. వాహనాల తనిఖీ సమయంలో అనుమానం వచ్చి పోలీసులు దర్యాప్తు చేయగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చినట్లు ఎస్సై తెలిపారు. నిందితులను వినుకొండ కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

అమ్మ పాలే అమృతం

- బిడ్డకు పాలిస్తే బాలింతకూ ఆరోగ్యం
- నేటి నుంచి తల్లి పాల వారోత్సవాలు



సత్తెనపల్లి: తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ వారోత్సవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని 2,031 అంగన్వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు ఈ మేరకు అవగాహన కల్పించనున్నారు. బిడ్డకు ఆరు నెలల పాటు తల్లి పాలను కచ్చితంగా ఇవ్వాలని వైద్యులు సూచిస్తుంటారు. శ్వాసకోశ, అలర్జీ, ఆస్తమా, చర్మ వ్యాధుల నుంచి ఇవి పిల్లలను రక్షిస్తాయి. వారి మానసిక, శారీరక వికాసానికి పోషకాలు అందిస్తాయి. తల్లి పాలు తాగే పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. పాలిచ్చే తల్లులకు నెలసరిలో రక్త స్రావం కూడా తక్కువగా ఉంటుంది. రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు రావడానికి అవకాశం చాలా తక్కువ. జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు 09 ఉండగా, అంగన్‌వాడీ కేంద్రాలు 2,031 ఉన్నాయి. వారోత్సవాలకు ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. గర్భిణులు 12,332 మంది, బాలింతలు 10,471 మంది ఉండగా వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

వైష్ణవ సంఘ సమాఖ్య కార్యవర్గ సమావేశం



ప్రసంగిస్తున్న తిరుమొళికై అళ్వార్ స్వామి

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం జీయర్ స్వామి ఆశ్రమంలో ఉభయ రాష్ట్రాల శ్రీవైష్ణవ సంఘాలతో ఏర్పడిన శ్రీ భగవద్రామానుజ శ్రీ వైష్ణవ సంఘ సమాఖ్య కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మరింగంటి తిరుమొళికై అళ్వార్ స్వామి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవైష్ణవ సంప్రదాయ దేవాలయాలు, పీఠాలు, సంఘాల మధ్య సమన్వయం సాధించాలని, తద్వారా సంప్రదాయ రక్షణకు కృషి జరగాలని అన్నారు. కార్యక్రమంలో ఉభయ వేదాంత పీఠం వేద విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ముడుంబై మధుసూదనాచార్యులు, జీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీరామ చక్రవర్తి, చక్రవర్తుల శ్రీనివాస రామానుజాచార్యులు, జగన్మోహనాచార్యులు, అగ్రహారం రాఘవేంద్ర, అకలంకం పార్థసారధి, వేదాంతం అచ్యుత కృష్ణ, యతిరాజుల బాలబాలాజీ, సమాఖ్య సభ్యులు, అంగలకుదురు వాసుదాసాశ్రమ నిర్వాహకులు పట్టాభి పాల్గొన్నారు.

గుండెపాటమ్మా.. రక్షించమ్మా !



కూరగాయల అలంకరణలో అమ్మవారు



కూరగాయలతో శివలింగాకృతి

రేపల్లె రూరల్: మండలంలోని పేటేరులో శ్రీ మహాలక్ష్మి గుండెపాటమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం శాకంబరి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. వేకువజామున ఆలయ అర్చకుడు సుమంత్ ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవలతో పంచామృతాలు, పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పట్టువస్త్రాలు, కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని ఉదయం నుంచి భక్తులు దర్శనం చేసుకుని పసుపు, కుంకుమ, గాజులు, నూతన వస్త్రాలు, పండ్లతో కూడిన సారెను సమర్పించారు. పెరుగన్నం, గారెలతో సద్ది నైవేద్యాలు సమర్పించారు. గ్రామంలోని రైతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిపించడంతో పాటు పాడిపంటలతో చల్లగా చూడాలని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణంలో కూరగాయలతో చేసిన అమ్మవారి రూపు, శివలింగాకృతులు భక్తుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు నేడు నోటిఫికేషన్

- 8న 1,757 పాఠశాలల్లో ఎన్నికలు
- అదే రోజు ఫలితాలు
- కొత్త కార్యవర్గం ఏర్పాటు

బాపట్ల టౌన్: పాఠశాలల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రుల్ని భాగస్వామ్యం చేసేందుకు వీలుగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్ మానిటరింగ్ కమిటీ (పీఎంసీ)లను ఏర్పాటు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం దాన్ని స్కూల్ మానిటరింగ్ కమిటీ (ఎస్ఎంసీ)గా మార్పు చేసింది. వీటి ఎన్నికలకు ఆగస్టు 1న నోటిఫికేషన్ విడుదల అవుతుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఓటర్ల లిస్టు (తల్లిదండ్రుల) ప్రచురణ చేస్తారు. 5న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల్లోపు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఆగస్టు 8న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు ఎన్నికల్ని తల్లిదండ్రులు చేతులెత్తే పద్ధతిలో నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్లతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 గంటల మధ్య తొలి సమావేశాన్ని నిర్వహించే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

విద్యార్థులకు హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

చీరాల అర్బన్: విద్యార్థులు కూడా తమ హక్కుల గురించి తెలుసుకోవాలని స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ మెంబర్ బి.పద్మావతి సూచించారు. చీరాలలోని ఏపీ మోడల్ పాఠశాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు హక్కుల గురించి, సమాజంలో పిల్లలపైన జరిగే దాడుల నుంచి రక్షించుకునే విధానాన్ని వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణను పరిశీలించారు. వెనుక పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించాలని, మరింత పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలో ఫిర్యాదు బాక్సును సక్రమంగా నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపాలని, రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. బోధనలో నాణ్యత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎస్సీపీసీఆర్ జిల్లా మెంబర్లు పాల్గొన్నారు.

బాపట్ల: ప్రభుత్వశాఖల సహాయ, సహకారాలతో జిల్లాను డ్రగ్స్‌రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. బాపట్లలోని వివిధ శాఖల అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల పద్మావతి మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణ కోసం పిల్లలు, తల్లిదండ్రులతో కమిటీలను ఏర్పాటు చేసి వారిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. మద్యం దుకాణాలు, మెడికల్ షాపుల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పాఠశాలలు, హాస్టల్స్‌కు సమీపంలో మద్యం షాపుల్ని వెంటనే తొలగించాలని జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు ఆదేశించారు. కళాశాలలు వదిలి పెట్టేటప్పుడు పోలీసు శాఖ ఆ ప్రాంతాల్లో ఒక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్సైజ్ శాఖ కూడా బాలలకు మద్యం విక్రయించవద్దంటూ షాపు యజమానులకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో జిల్లాల బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు నీలిమ వంశీలత, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు అధికారి కె.ఉమ పాల్గొన్నారు.